# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 31-08-2026** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **మార్కాపురం జిల్లాలోని వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు జాతికి అంకితం చేశారు.**

2. **అభివృద్ధి, ఆదాయం, సంక్షేమం మధ్య సమతుల్యత ద్వారా స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతుందని కేంద్రమంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు.**

3. **రాష్ట్రంలో వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగు కోసం ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టిందని వ్యవసాయశాఖ మంత్రి కె.అచ్చెన్నాయుడు తెలిపారు.**

4. **దేశానికి వస్తున్న పెట్టుబడుల్లో 25 శాతం రాష్ట్రానికి వస్తున్నాయని మంత్రి కొల్లు రవీంద్ర వెల్లడించారు.**

==========================

మార్కాపురం జిల్లాలోని వెలిగొండ సాగునీటి ప్రాజెక్టు తొలి దశను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు ప్రారంభించి.. జాతికి అంకితం చేశారు. 'వెలిగొండ జలసిరులు-అభివృద్ధికి రెక్కలు' పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఈ ప్రారంభోత్సవాన్ని నిర్వహించింది. కృష్ణాజలాలకు చంద్రబాబు నాయుడు జలహారతి ఇచ్చి.. ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వెలిగొండ ఫీడర్ కెనాల్ ఒడ్డున ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మినియేచర్‌ను ముఖ్యమంత్రి పరిశీలించారు. ప్రాజెక్టు ద్వారా ఏయే ప్రాంతాలకు నీరు చేరుతుంది... ఎన్ని ఎకరాలకు సాగునీరు అందుతుందనే వివరాలను అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. అనంతరం ప్రాజెక్టు పైలాన్‌ను ఆవిష్కరించి ప్రాజెక్టు గేట్లు ఎత్తి నీటిని విడుదల చేశారు.

-------------------------

మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో జల్ జీవన్ మిషన్-అమరజీవి జలధార కింద చేపడుతున్న మెగా వాటర్ గ్రిడ్ పథకానికి వెలిగొండ ప్రాజెక్టు ప్రధాన నీటి వనరుగా నిలుస్తుందని ఉప ముఖ్యమంత్రి కె.పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. వెలిగొండ ప్రాజెక్టు తొలి దశ ప్రారంభంపై సామాజిక మాధ్యమం ఎక్స్ వేదికగా ఆయన ఈరోజు స్పందిస్తూ, ప్రాజెక్టు తొలి దశ ద్వారా లక్షా 19 వేల ఎకరాలకు సాగునీరు, నాలుగు లక్షల మందికి తాగునీరు అందుతుందని తెలిపారు. ప్రాజెక్టు సాకారం కోసం కృషి చేసిన ఇంజినీర్లు, అధికారులు, ప్రజాప్రతినిధులు, రైతు సంఘాలు, ప్రజా సంస్థలకు పవన్ కల్యాణ్ అభినందనలు తెలిపారు.

-------------------------

అభివృద్ధి, ఆదాయం, సంక్షేమం మధ్య సమతుల్యత సాధించినప్పుడే స్వర్ణాంధ్రప్రదేశ్ నిర్మాణం సాధ్యమవుతుందని కేంద్ర గ్రామీణాభివృద్ధి శాఖ సహాయ మంత్రి పెమ్మసాని చంద్రశేఖర్ పేర్కొన్నారు. గుంటూరు జిల్లాలోని రాజధాని గ్రామాల్లో పలు అభివృద్ధి పనులను కేంద్రమంత్రి నిన్న ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, రాష్ట్రాన్ని అభివృద్ధిలో ముందుకు తీసుకెళ్లాలంటే ప్రజల ఆదాయం పెంచడం అత్యంత కీలకమని తెలిపారు. గ్రామాల్లో రోడ్లు, పాఠశాలలు, మౌలిక వసతుల అభివృద్ధికి పెద్ద ఎత్తున పెట్టుబడులు అవసరమని పేర్కొంటూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

విశాఖపట్నంలో ఒక అంతర్జాతీయ స్థాయి ప్రయివేటు ఆసుపత్రి నిర్మాణానికి ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ ఈరోజు శంకుస్థాపన చేశారు. జిల్లాలోని ఆనందపురం మండలం ఎండాడలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ, విశాఖలో ఈ ఆసుపత్రి ఏర్పాటుతో దశలవారీగా ఐదేళ్లలో రెండు వేల కోట్ల రూపాయల పెట్టుబడి రానుందని, సుమారు తొమ్మిది వేల మందికి ఉద్యోగ అవకాశాలు లభించనున్నాయని తెలిపారు. వైద్య సేవలు, శిక్షణ, పరిశోధనతో పాటు ఎనిమిది సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌లలో 50కి పైగా వైద్య ప్రత్యేక విభాగాలను అందుబాటులోకి తీసుకురానున్నారని దీని ద్వారా అంతర్జాతీయ స్థాయిలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని మంత్రి తెలిపారు.

---------------------------

రాష్ట్రంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఉన్నప్పటికీ ఖరీఫ్ సాగు కోసం ప్రభుత్వం ముందస్తు ప్రణాళికతో చర్యలు చేపట్టిందని వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటివరకు రాష్ట్రంలో 192.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైందని 51 శాతం లోటు ఏర్పడిందన్నారు. వర్షాభావ పరిస్థితుల్లోనూ ప్రత్యామ్నాయ పంటల సాగును ప్రోత్సహించడంతో పప్పుధాన్యాల సాగు 23.6 శాతం పెరిగిందని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో వరి 10.37 లక్షల హెక్టార్లు, కంది 2.30 లక్షలు, వేరుశనగ 1.37 లక్షల హెక్టార్లలో సాగవుతున్నట్లు తెలిపారు. ఎల్‌నినో ప్రభావంతో వ్యవసాయ శాస్త్రవేత్తల సూచనలతో తక్కువ నీటితో పండే ప్రత్యామ్నాయ పంటలను ప్రోత్సహించేలా ప్రణాళికలు రూపొందించామన్నారు. ఖరీఫ్ 2026లో పంట నష్టాన్ని నివారించేందుకు, 'రైతన్న మీకోసం – ఎల్‌నినో ప్రభావ నివారణ ప్రణాళిక'ను రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తున్నామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

---------------------------

దేశానికి వస్తున్న మొత్తం పెట్టుబడుల్లో 25 శాతం ఆంధ్రప్రదేశ్‌కు వస్తున్నాయని గనులు, భూగర్భ వనరుల శాఖ మంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ... రాష్ట్రంలో పెట్టుబడులకు అనుకూల వాతావరణం కల్పిస్తున్నామని తెలిపారు. ప్రభుత్వ ప్రోత్సాహకాలతో పెట్టుబడిదారులు ముందుకు వస్తున్నారని తెలియజేస్తూ,

వాయిస్..30.. సెకన్లు

---------------------------

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ముఖ్యమంత్రి సహాయనిధి అండగా నిలుస్తోందని చీరాల శాసనసభ్యులు

ఎం.ఎం. కొండయ్య అన్నారు. బాపట్ల జిల్లా చీరాల నియోజకవర్గానికి చెందిన 110 మంది లబ్ధిదారులకు మంజూరైన 64 లక్షల 49 వేల 768 రూపాయల విలువైన ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను క్యాంపు కార్యాలయంలో ఆయన ఈ రోజు అందజేశారు. అనంతరం కొండయ్య మాట్లాడుతూ, అనారోగ్యంతో ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న వారు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా సహాయం పొందవచ్చని అన్నారు.

--------------------------

ప్రజా ఫిర్యాదుల పరిష్కారానికి అధిక ప్రాధాన్యం ఇవ్వాలని కాకినాడ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్ అధికారులను ఆదేశించారు. కాకినాడ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక పీజీఆర్ఎస్ కార్యక్రమంలో ఆయన ఈరోజు పాల్గొని... గతంలో వచ్చిన ఫిర్యాదుల పరిష్కారంపై అధికారులతో సమీక్షించారు. ప్రతి ఫిర్యాదును నిర్ణీత గడువులోగా పరిశీలించి... మళ్లీ ఫిర్యాదు చేయాల్సిన అవసరం లేకుండా నాణ్యమైన పరిష్కారం అందించాలని సూచించారు. ఫిర్యాదుల పరిష్కారంలో కాకినాడ జిల్లాను రాష్ట్రస్థాయిలో మెరుగైన స్థానంలో నిలపాలని కోరారు. డ్యాష్‌బోర్డుల ద్వారా ఫిర్యాదుల పురోగతిని నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

--------------------------

వెలిగొండ ప్రాజెక్టుతో ఉమ్మడి ప్రకాశం జిల్లాలో కృష్ణా జలాలు ప్రజలకు అందుబాటులోకి వచ్చాయని పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్దన్‌రెడ్డి అన్నారు. వెలిగొండ తొలి దశ ద్వారా లక్షా 19 వేల ఎకరాలకు సాగునీరు, నాలుగు లక్షల మందికి తాగునీరు అందుతుందని ఈరోజు ఒక ప్రకటనలో తెలిపారు. నిర్వాసితులకు 768 కోట్ల రూపాయల పరిహారం పంపిణీ చేశామని తెలిపారు. ఈ ప్రాజెక్ట్ ద్వారా మూడు జిల్లాల్లోని 30 మండలాల ప్రజలకు ఫ్లోరైడ్ తాగునీటిసమస్య తీరుతుందని బీసీ జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు.

--------------------------

రాష్ట్రంలో ఇప్పటికే మంజూరైన 700 బస్సులకు అదనంగా మరో 300 ఎలక్ట్రిక్ బస్సులు రానున్నాయని రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ –ఏపీయస్ఆర్టీసీ ఛైర్మన్ కొనకొళ్ల నారాయణ తెలిపారు. అనంతపురం ఆర్టీసీ డిపోలో నిర్మాణంలో ఉన్న ఎలక్ట్రిక్ ఛార్జింగ్ స్టేషన్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా కొనకొళ్ల నారాయణ మాట్లాడుతూ, అక్టోబర్‌లో రాష్ట్రంలోని పలు ఆర్టీసీ డిపోల్లో 350 ఎలక్ట్రిక్ బస్సులను ప్రారంభించనున్నట్లు తెలిపారు. డిసెంబర్‌లో అనంతపురంలో 50 ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకురానున్నట్లు చెప్పారు.ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా ఎలక్ట్రిక్ బస్సులను అందుబాటులోకి తీసుకువస్తున్నామని పేర్కొన్నారు.

======================